సాక్షి
అనకాపల్లి
సోమవారం । 20 । అక్టోబర్ । 2025



వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవల్లో స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు.



కమనీయం.. శాంతి కల్యాణం

పద్మనాభం: కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు శాంతి కల్యాణంతో ఘనంగా ముగిశాయి.

ఆరోగ్యకర జీవనానికి..



ఘనంగా ధన్వంతరి హోమం.. పాల్గొన్న ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ గోపాలన్ రవీంద్రన్, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు

8లో

● వెలుగుల పండగ.. ఆనందం నిండగ..




దీపావళి.. వెలుగులు విరజిమ్మే పండగ. చీకటిని పారదోలి జీవితంలోకి కొత్త ఆశలను ఆహ్వానించే పర్వదినం. ప్రతి ఇంటి ముందు చిచ్చుబుడ్లు కాంతులు వెదజల్లుతాయి. ఆకాశంలోకి రివ్వున వెళ్లే తారజువ్వలు, కాకర పువ్వొత్తులు వెలిగిస్తూ అందరూ ఆనందంగా గడుపుతారు. ప్రతి ఇంట్లో సంతోషాల కోలాహలానికి ప్రతీకగా ఇవన్నీ నిలుస్తాయి. దీపావళి అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి. అందరూ సంతోషంగా పండగ జరుపుకోవాలి.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చీకటి వెలుగుల దీపావళి

- ఈ ఏడాది కానరాని సందడి
- మందకొడిగా బాణసంచా విక్రయాలు
- డీలాపడ్డ సాధారణ మార్కెట్





అనకాపల్లిలో బాణసంచా స్టాల్

సాక్షి, అనకాపల్లి: చీకట్లను పారదోలి అందరి జీవితాల్లో వెలుగులు నింపే దీపావళి పండగ ఈ ఏడాది ప్రజలకు, వ్యాపారులకు నిరాశే మిగులుస్తోంది. నిత్యావసరాలతోపాటు అన్ని వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యుడికి దీపావళి పండగ భారంగా మారింది. ఈ ఏడాది బాణసంచా ధరలు 20 నుంచి 25 శాతం పెరగడం.. 40 శాతానికి పైగా వ్యాపారం తగ్గడంతో ఇటు వ్యాపారస్తుల్లో మరింత దిగులు మొదలైంది. దీనికి తోడుగా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో చివరి క్షణం వరకు స్టాళ్లకు అనుమతి ఇవ్వకపోవడంతో వ్యాపారస్తులు మరింత మందివడుతున్నారు. రెవెన్యూ, పోలీసు, ఫైర్ డిపార్ట్‌మెంట్ల వారు బాణసంచా వ్యాపారాలకు అనుమతి త్వరితగతిన ఇవ్వాలంటే ముందు కూటమి నేతల్ని ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చింది. పచ్చ నేతలు చెప్పిన వారికే పర్మిషన్లు ఇచ్చారు. ఇటు వ్యాపారం లేదు.. అటు మామూళ్లు ఇస్తే గానీ అనుమతి ఇవ్వడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు. మరికొందరు వ్యాపారస్తులైతే ఈ ఏడాది వ్యాపారానికి స్వస్తి చెప్పేశారు.





మార్కెట్లో వివిధ రకాల ప్రమిదలు

వ్యాపారాలు వెలగలేదు..

గతేడాది అంతంతమాత్రంగానే ఉండటంతో.. ఈసారైనా వ్యాపారాలు ఆశాజనకంగా ఉంటాయని వ్యాపారులు ఆశ పెట్టుకున్నారు. కానీ.. మతాబుల్లా వెలిగిపోతాయనుకుంటే.. మబ్బు పట్టినట్లుగా డల్‌గా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 226 షాపులకు అనుమతులివ్వగా.. ఇందులో కూటమి నేతలకు చెందినవి, వారు సిఫార్సు చేసిన దుకాణాలే 200 వరకూ ఉంటాయని తెలుస్తోంది. అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం షాపుల్లో విక్రయాలు మొదలయ్యాయి. అనకాపల్లి పరిధిలో 5, యలమంచిలి 4, నర్సీపట్నం పరిధిలో 2 ఏర్పాటు చేశారు. అయితే.. చచ్చీ చెడీ.. ఎలాగోలా పర్మిషన్లు తీసుకున్న వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రజల్లో కొనుగోలు శక్తి లేకపోవడంతో.. వ్యాపారాలు వెలగడం లేదు. ఆదివారం రాత్రి వరకూ అంతంత మాత్రంగానే కొనుగోళ్లు జరిగాయి. దీపావళి రోజున మధ్యాహ్నం వరకూ జరిగే కొనుగోళ్ల పైనే తమ లాభాలు ఆధారపడి ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో ఈపాటికే.. 70 శాతం వరకూ స్టాక్ విక్రయాలు జరిగిపోయేవనీ.. ఈసారి 40 శాతం కూడా కొనుగోళ్లు జరిగే సూచనలు కనిపించడం లేదంటున్నారు.



అనకాపల్లిలోని ఫైర్ స్టేషన్

అప్రమత్తతే శ్రీరామరక్ష

అనకాపల్లి: దీపావళి.. వెలుగులు విరజిమ్మే ఆనందాల పండగ. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకుంటారు. అయితే ఈ సంతోషం విషాదంగా మారకుండా ఉండాలంటే కాస్త అప్రమత్తత అవసరం. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా, చిన్నపాటి అజాగ్రత్త వహించినా వెలుగుల పండగ జీవితంలో చీకట్లు నింపే ప్రమాదం ఉంది. టపాకాయలు కాల్చేటప్పుడు బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఎల్లప్పుడూ ఇంటి బయటే టపాసులు వెలిగించాలి. గుడిసెలు, గడ్డివాములు, పెట్రోల్ బంకులకు దూరంగా బాణసంచా వెలిగించాలి.

వీరికి పండగ లేదు

దీపావళి పండగ రోజు అందరూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపితే అగ్నిమాపక సిబ్బంది మాత్రం ఎలాంటి ప్రమాదం జరిగినా కాపాడేందుకు సంసిద్ధులై ఉంటారు. జిల్లాలో 6 ఫైర్ స్టేషన్లలో 75 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీటితో పాటుగా మరో రెండు అవుట్‌సోర్సింగ్ ఫైర్‌స్టేషన్లలో 25 మంది సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో ఫైర్ స్టేషన్లు.. ఫోన్ నంబర్లు

అనకాపల్లి - 08924-222299
యలమంచిలి - 08924-222299
నర్సీపట్నం -08924-231101
మాడుగుల -08924-235101
చోడవరం -08934-345199
సబ్బవరం -08924-231101

అవుట్ సోర్సింగ్ ఫైర్ స్టేషన్లు..

నక్కపల్లి - 08924-231101
రావికమతం - 08932-235101

న్యూస్‌రీల్

'రైవాడ' నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు విడుదల



రైవాడ జలాశయం నుంచి నీరు విడుదల

దేవరాపల్లి: రైవాడ జలాశయం నుంచి మూడు స్పిల్‌వే గేట్ల ద్వారా 4 వేల క్యూసెక్కుల వరద నీటిని శారదా నదిలోకి విడుదల చేశారు. ఆదివారం మధ్యాహ్నం ప్రాంతంలో అనంతగిరి మండలం పరిధిలో కురిసిన భారీ వర్షాల ధాటికి జలాశయంలోకి ఒక్కసారిగా భారీగా వరద నీరు పోటెత్తింది. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ డీఈ జి.సత్యంనాయుడు స్పిల్‌వే గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా భారీ వర్షాల ధాటికి 3 వేల క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. జలాశయంలోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదల పెంపు, తగ్గుదల చేస్తామని డీఈ తెలిపారు.

నేడు సింహగిరిపై నరకాసురవధ



సింహాచలం : నరకచతుర్దశిని పురస్కరించుకుని సోమవారం రాత్రి సింహగిరిపై జరిగే నరకాసురవధ ఉత్సవానికి దేవస్థానం వైదిక, అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవంలో భాగంగా నరకాసురుడి విగ్రహాన్ని ఒక పల్లకిలోనూ, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులైన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మరొక పల్లకిలోనూ వేంజింపజేస్తారు. అనంతరం సింహగిరి మాడవీధిలో ఈ రెండు పల్లకీలను ఎదురెదురుగా ఉంచి, శాస్త్రోక్తంగా నరకాసుర వధ ఘట్టాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా యుద్ధ సన్నివేశాలు, నరకాసుర వధ ఘట్ట విన్నపం పూజలు జరుపుతారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తారు. సోమవారం రాత్రి 7 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధ తెలిపారు.

స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు కొనసాగింపు

ఒక్కరోజే 450 మంది అవుట్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై ఒకవైపు ఆందోళనలు కొనసాగుతుండగానే.. మరోవైపు యాజమాన్యం తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తోంది. తాజాగా శనివారం రాత్రి సుమారు 450 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన తర్వాత దశలవారీగా ముగిసిన కాంట్రాక్టులను రెన్యూవల్ చేయకపోవడం ద్వారా సుమారు 1,500 మందిని తప్పించింది. అలాగే పనులు చేస్తున్న సుమారు 3,500 మందిని తొలగించింది. దీంతో మొత్తం సుమారు 5,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించినట్టు అయింది. వీరిలో సుమారు 270 మంది నిర్వాసితులు కూడా ఉన్నారు. ఈ తొలగింపులపై ఇప్పటికే ఆందోళనలు జరుగుతుండగా.. యాజమాన్యం మరోసారి తొలగింపులు చేపట్టడం గమనార్హం. అయితే శనివారం తొలగించిన 450 మంది జాబితాలో నిర్వాసితులు లేనట్టు సమాచారం.

'డ్యూడ్'కి అద్భుత రెస్పాన్స్



డ్యూడ్ హీరో ప్రదీప్ రంగనాథన్

డాబాగార్డెన్స్ (విశాఖ): యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ నటించిన తాజా చిత్రం 'డ్యూడ్'.. దీపావళి కానుకగా విడుదలైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తి శ్వరణ్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. మమితా బైజు కథానాయికగా నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ నెల 17న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన స్పందనతో బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను అందుకుని, హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ 'డ్యూడ్ 'దివాళీ టూర్‌ను చేపట్టారు. తమ సినిమాను అద్భుతంగా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పేందుకు విశాఖ విచ్చేసిన హీరో ప్రదీప్ రంగనాథన్.. నగరంలోని రామా టాకీస్, సంగం శరత్ థియేటర్లలో ప్రేక్షకులతో 'డ్యూడ్ దివాళీ బ్లాస్ట్' పేరుతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమిళనాడులోనూ గత చిత్రాల కంటే 'డ్యూడ్'కు ఎక్కువ కలెక్షన్లు వస్తున్నాయని తెలిపారు. 'నా గత చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' కంటే తొలి, మలి రోజుల్లోనే నాలుగైదు రెట్లు ఎక్కువ కలెక్షన్లు 'డ్యూడ్' సినిమాకు వచ్చాయని మా నిర్మాతలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. ఈ ఘన విజయానికి కారణమైన దర్శకుడికి, నిర్మాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చర్చలకు కలెక్టర్ కబురు

ఆదివారం గ్రామసభ నిర్వహిద్దామని ఆర్డీవోతో వర్తమానం

ముందు రోజు రాత్రి 9 గంటలకు చెప్పడంతో మత్స్యకారుల అసంతృప్తి



ముందస్తు సమాచారం ఇచ్చాకే చర్చలకు రావాలని ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న జెడ్పీటీసీ కాసులమ్మ, మత్స్యకారులు

రెండు రోజుల ముందే చెప్పాలి

అప్పటికప్పుడు చెబితే చర్చలకు రాలేమన్న గంగపుత్రులు

దీపావళి వెళ్లాక తేదీ నిర్ణయించమని వినతి పత్రం

నక్కపల్లి: ముందస్తు సమాచారం లేకుండా అప్పటికప్పుడు చర్చలకు రావాలంటే తమకు సాధ్యం కాదని రాజయ్యపేట మత్స్యకారులు స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా దాదాపు 35 రోజుల నుంచి ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో చర్చలు జరిపేందుకు ఆదివారం వస్తున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కబురు చేశారు. దీపావళి తర్వాత రెండు రోజులు ముందుగా చెప్పి రావాలని వారు వినతి పత్రం ఇచ్చారు. గత ఆదివారం మత్స్యకారులంతా జాతీయరహదారిని ముట్టడించి నాలుగు గంటలపాటు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. 15వ తేదీన రాజయ్యపేటలో గ్రామసభ నిర్వహిస్తానని ఆ సందర్భంగా కలెక్టర్ ప్రకటించారు. అయితే ఆమె హఠాత్తుగా వ్యక్తిగత పని మీద చెన్నై వెళ్లడంతో ఆ సభ వాయిదా పడింది. శనివారం రాత్రి నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ,



నక్కపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



ఆదివారం మధ్యాహ్నం నుంచి యథావిధిగా నిరాహార దీక్షలు

తహసీల్దార్ నర్సింహమూర్తిలతో గ్రామస్తులకు వర్తమానం పంపించారు. ఆదివారం ఉదయం పది గంటలకు కలెక్టర్ వస్తున్నారని, గతంలో హామీ ఇచ్చిన మేరకు చర్చలు జరుపుతారని తెలియజేశారు. అయితే అంత అకస్మాత్తుగా చర్చలు సాధ్యం కావని మత్స్యకారులు స్పష్టం చేశారు. తమ వారంతా వివిధ పనులపై బయటకు వెళ్లిపోయారని, ముందుగా సమాచారం ఇచ్చి రావాలని తెలిపారు. ఆదివారం ఉదయాన్నే ఆర్డీవో, తహసీల్దార్, డీఎస్పీలు రాజయ్యపేట చేరుకున్నారు. ఇప్పటికే గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాల్లో వెయ్యిమందికి పైగా మోహరించిన పోలీసులు కలెక్టర్ వస్తున్నారన్న సమాచారంతో మరింతమందిని రంగంలోకి దించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి పోలీసులను, స్పెషల్ పార్టీ సిబ్బందిని రప్పించారు. ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

తొలుత దీక్షకు విరామం..

అనంతరం యథాతథం

అప్పటికప్పుడు చర్చలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు తొలుత ఆదివారం నిరాహార దీక్షను తాత్కాలికంగా రద్దు చేసుకున్నారు. ముందస్తు సమాచారం లేకుండా కలెక్టర్ చర్చలకు వస్తానని చెప్పడంతో అసంతృప్తి చెందిన మత్స్యకారులంతా ఆదివారం నిరాహారదీక్షకు విరామం ప్రకటించారు. జెడ్పీటీసీ గోసల కాసులమ్మ ఆధ్వర్యంలో మత్స్యకార నాయకులు సోమేష్, మహేష్, కాశీరావు, సోమేశ్వరరావు, పిక్కి స్వామి, మైలపల్లి సూరిబాబు తదితరులు ఆర్డీవో వద్దకు వచ్చి వినతి పత్రం ఇచ్చారు. రాత్రికి రాత్రి వచ్చి చర్చలు అంటే కుదరదన్నారు. రెండు రోజుల ముందు సమాచారం ఇవ్వాలన్నారు. ఇతర ప్రాంతాలకు తాత్కాలికంగా వలస వెళ్లిన వారిని, వివిధ పనుల మీద వెళ్లిన వారిని తిరిగి స్వగ్రామాలకు రప్పిస్తామన్నారు. దీపావళి అనంతరం రెండు రోజుల ముందు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమకు సంఘీభావం తెలిపే వారిని, తమ తరఫున చర్చల్లో పాల్గొనే వారిని అడ్డుకోవడానికి వీల్లేదన్నారు. వందలాది మంది పోలీసులు గ్రామం చుట్టు వలయంగా ఏర్పడ్డారని, గ్రామంలోకి ఎవరినీ రానివ్వడం లేదని, ఆధార్ కార్డు చూపిస్తే తప్ప గ్రామంలోకి అడుగు పెట్టనివ్వడం లేదన్నారు. ఎక్కడికక్కడ పోలీస్ పికెట్లు పెట్టి మత్స్యకారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తాము శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ఇంతమంది పోలీసులను ఎందుకు కాపలా పెడుతున్నారని ప్రశ్నించారు. తక్షణమే గ్రామం నుంచి పోలీసులను ఖాళీ చేయించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. అక్కడక్కడ బల్క్ డ్రగ్ పార్క్ పనులు మొదలు పెడుతున్నారని, గతంలో హోంమంత్రి, కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు పనులు తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. కలెక్టర్‌తో చర్చలు పూర్తయ్యేవరకు తాము శాంతియుతంగా నిరాహార దీక్షలు కొనసాగిస్తామని, ఎటువంటి హింసాత్మక ఘటనలకు పాల్పడమని మత్స్యకారులు స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం దీక్షకు విరామం ప్రకటించిన మత్స్యకారులు మధ్యాహ్నం నుంచి యథావిధిగా ఆందోళన ప్రారంభించారు.

ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే..!

ఒకపక్క మత్స్యకారుల ఆందోళన రోజురోజుకు తీవ్రతరమవుతోంది. మరోపక్క వైఎస్సార్‌సీపీ ఈనెల 22న 'చలో రాజయ్యపేట'కు పిలుపునిచ్చింది. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు పాల్గొంటారని ప్రకటించడంతో.. ప్రతిపక్ష నేతలు రాజయ్యపేట వస్తే వైఎస్సార్‌సీపీకి మైలేజీ పెరగడంతోపాటు ఉద్యమం తీవ్రరూపం దాలుస్తుందని ప్రభుత్వ పెద్దలు భయపడినట్టు తెలుస్తోంది. దీంతో ఆగమేఘాల మీద ఆదివారం మత్స్యకారులతో చర్చలు జరిపి నిరాహార దీక్షకు ముగింపు పలకాలని కలెక్టర్‌కు సూచించినట్లు సమాచారం.

గుండె నిండా స్వాభిమానం.. అదే మా ఉద్యమానికి 'ఆధార'ం

- రాజయ్యపేటలో ప్రత్యేక ఆకర్షణగా టీ షర్ట్‌లు
- ఆధార్ కార్డు, బల్క్ డ్రగ్ ఉద్యమం ముద్రణ
- చెక్ పోస్టుల వద్ద ఐడెంటిటీ అడుగుతున్న పోలీసులు
- గుండెపైనున్న ఆధార్ ముద్రను చూపుతున్న మత్స్యకారులు



రాజయ్యపేటవాసులు ధరించిన టీ షర్ట్‌లపై ముద్రించిన ఆధార్ కార్డు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనలో పోలీసుల వైఖరి గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. గ్రామంలోకి వచ్చి వెళ్లే వారిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. గ్రామం నుంచి బయటకు వెళ్లినప్పుడు, గ్రామంలోకి వచ్చినప్పుడు పోలీసులు అడిగే సవాలక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పడం తమ వల్ల కావడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. ఆధార్ చూపిస్తే తప్ప గ్రామంలోకి రానివ్వడం లేదని యువకులు చెబుతున్నారు. తనిఖీలో ప్రతిసారి ఆధార్ కార్డు చూపించడం తమ వల్ల కావడం లేదంటూ కొంతమంది యువకులు 'బల్క్ డ్రగ్ పార్క్ వద్దు, రాజయ్యపేట ముద్దు' అంటూ టీ షర్ట్‌లు తయారు చేయించారు. వెనుక పక్క ఉద్యమ నినాదం, ముందు పక్క బనియన్ ధరించిన వ్యక్తి ఆధార్ కార్డు, ఫొటోను ముద్రించారు. వీటిని ధరించి నిరాహార దీక్షలో పాల్గొంటున్నారు. రాజయ్యపేట నుంచి బయటకు వెళ్లే సమయంలో కూడా వీటిని ధరించి వెళ్తున్నారు. పోలీసులకు ప్రత్యేకంగా ఆధార్ కార్డు చూపించే అవసరం లేకుండా తాము ధరించిన టీ షర్ట్‌లపై ఆధార్ కార్డు, ఫొటో, బల్క్ డ్రగ్ పార్క్ వద్దు అనే నినాదాన్ని రాయించారు. ప్రస్తుతం రాజయ్యపేటలో ఈ టీ షర్ట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

క్లుప్తంగా

వివాహిత మృతిపై కేసు నమోదు


మృతదేహాన్ని పరిశీలి స్తున్న తహసీల్దార్, పట్టణ ఎస్‌ఐ

యలమంచిలి రూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో ఆదివారం వివాహిత మృతిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక్కడ నివాసముంటున్న ముమ్మిన సత్యం రాజు భార్య రిజుత(26) ఆదివారం అకస్మాత్తుగా అనారోగ్యంతో మృతి చెందినట్టు మృతురాలి తండ్రి దొడ్డ రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని యలమంచిలి తహసీల్దార్ కె.వరహాలు, పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి పరిశీలించారు. అయితే మృతికి గల కారణాలు స్పష్టంగా తెలియలేదు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు, శవపంచనామా అనంతరం పోస్టుమార్టం పూర్తి చేయించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారకుడిపై దాడి

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న ప్రభోదానందుని శిష్యులపై ఆదివారం భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో దాడి జరిగింది. ఫిజియోథెరపిస్ట్ అయిన ముమ్మిడిశెట్టి ఆదిత్య అనే వ్యక్తి మరికొందరితో కలిసి తమపై దాడి చేశారని, త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలను విసిరి, ప్రచార స్టాళ్లను విరగ్గొట్టారని భీమిలి మండలం తాటితూరుకు చెందిన బోని శ్రీనివాసరావు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై భీమిలి పోలీసులు ఇరువర్గాలను పిలిచి విచారణ చేస్తున్నారు.

రోడ్ల పునరుద్ధరణకు రూ.7.20 కోట్లు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలంలో రోడ్ల పునరుద్ధరణకు ప్రభుత్వం రూ.7.20 కోట్లు మంజూరు చేసిందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయం నుంచి ఆదివారం వీడియో విడుదల చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా ఈ నిధులు విడుదలయ్యాయని తెలిపారు. సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం నుంచి మాకవరపాలెం మండలం రాచపల్లి రోడ్డు, వయా చౌడువాడ, నగరం, కోడూరు మీదుగా రహదారి పునరుద్ధరణకు రూ.4.60 కోట్లు, మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం జంక్షన్ నుంచి రోలుగుంట వయా లచ్చన్నపాలెం, కుసర్లపూడి వరకు ఉన్న రహదారి పునరుద్ధరణకు రూ.2.60 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ రెండు పనులకు ప్రభుత్వం మొత్తం రూ.7.20 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ఆరోగ్యకర జీవనానికి దిక్సూచి

ఆయుర్వేదం

- ప్రముఖ ఆయుర్వేద వైద్యులు కన్నాలయం గోపాలన్ రవీంద్రన్
- పాయకరావుపేటలో ఘనంగా ధన్వంతరి హోమం
- పాల్గొన్న ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు


డాక్టర్ కన్నాలయం గోపాలన్ రవీంద్రన్‌ను సన్మానిస్తున్న చాగంటి కోటేశ్వరరావు, నర్సింహరావు

పాయకరావుపేట: ఆయుర్వేద వైద్యం మన పూర్వీకులు మనకు ఇచ్చిన గొప్ప సంపద అని, ఆయుర్వేదం మనిషి ఆరోగ్యకరమైన జీవన విధానానికి దారిచూపే ఒక దిక్సూచి అని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కన్నాలయం గోపాలన్ రవీంద్రన్ అన్నారు. ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతి, జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో శ్రీ ప్రకాష్ ఆయుష్ చారిటబుల్ అండ్ రిసెర్చ్ ట్రస్టు వ్యవస్థాపకులు సిహెచ్.కె.నరసింహారావు, రామసీత దంపతులతో వేదపండితుల శాస్త్రోక్తంగా ధన్వంతరి హోమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కన్నాలయం గోపాలన్ రవీంద్రన్, ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ధన్వంతరి జయంతి సందర్భంగా హోమం

ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ కన్నాలయం గోపాలన్ రవీంద్రన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు కూడా నేడు ఆయుర్వేద వైద్య ఆవశ్యకతను గుర్తించి ఆయుర్వేదానికి ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. అనంతరం విద్యా సంస్థల్లో ఉన్న ఆయుర్వేద వైద్యాలయాన్ని సందర్శించారు. ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా ఆయుర్వేద వైద్యులు కన్నాలయం గోపాలన్ రవీంద్రన్‌ను ఘనంగా సన్మానించారు.

పుస్తకమే నిజమైన గురువు

మరొక ముఖ్య అతిథి ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చరిత్ర కలిగిన మేధావుల జీవిత చరిత్రలను చదవాలని, తద్వారా మంచి క్రమశిక్షణ అలవడుతుందన్నారు. మాజీ రాష్ట్రపతులు అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణన్, స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ, అబ్రహం లింకన్ వంటి మహనీయుల జీవిత గాథలు చదివినట్టయితే విద్యార్థులకు చదువుతోపాటు మంచి నడవడిక కలుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి, ప్రతి వ్యక్తి కూడా విద్యతో పాటు క్రమశిక్షణ, మంచి నడవడిక అలవర్చుకోవాలన్నారు. పుస్తకమే నిజమైన గురువని విద్యార్థులకు దిశనిర్దేశం చేశారు. అనంతరం చాగంటి కోటేశ్వరరావును విద్యాసంస్థల కరస్పాండెంట్, సెక్రటరీ నర్సింహారావు, జాయింట్ సెక్రటరీ విజయ్ ప్రకాష్ పూలమాల వేసి, పుస్తకాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యాలయం ట్రస్టు డాక్టర్ యు.ఇందూలాల్, ఆయుర్వేద చికిత్సాలయ సలహాదారుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రధాన వైద్యులు డాక్టర్ టి.రమేష్‌బాబు, డాక్టర్ ఎం.ఏసయ్య, ఆయుర్వేద ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎ.కోడూరు విద్యార్థులకు

ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్


ఆల్ రౌండ్ చాంపియన్‌షిప్‌ను సాధించిన విద్యార్థులతో పీఈటీలు చిట్టి ప్రసాద్, స్వామినాయుడు

కె.కోటపాడు: కె.కోటపాడు హైస్కూల్‌లో ఈ నెల 17, 18లలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడాపోటీల్లో ఎ.కోడూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థినీవిద్యార్థులు ఉత్తమ ప్రతిభను చూపారు. వివిధ క్రీడల్లో బాలురు మంచి ప్రతిభను కనబర్చడంతో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆల్ రౌండ్ చాంపియన్‌షిప్ అర్హతను సాధించగా, బాలికలు పలు క్రీడా విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనతో గర్ల్స్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌ను సాధించినట్టు పీఈటీలు కె.చిట్టి ప్రసాద్, స్వామినాయుడు తెలిపారు. బాలుర విభాగంలో అండర్-17 విభాగంలో వాలీబాల్‌లో విన్నర్, బ్యాట్మింటన్‌లలో విన్నర్‌లుగా నిలవగా, ఖో-ఖోలో రన్నర్స్‌గా నిలిచారు. అండర్-14 విబాగంలో ఖో-ఖోలో విన్నర్‌గాను, వాలీబాల్‌లో రన్నర్‌లుగా నిలిచారు. అథ్లెటిక్స్‌లో అండర్-17లో 100 మీటర్ల పరుగు పందెంలో జి.తేజ మొదటి స్థానంలో నిలవగా, కె.జాన్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. 200 మీటర్ల పరుగు పందెంలో ఎం.మనోహర్ మొదటి స్థానంలోను, జి.తేజ ద్వితీయ స్థానంలో నిలిచాడు. 400 మీటర్ల పరుగు పందెంలో జి.గంగాధర్ మొదటి స్థానంలో నిలవగా, కె.జాన్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. 800 మీటర్ల పరుగు పందెంలో డి.హరీష్ ద్వితీయ స్థానంలో నిలవగా, ఎం.పూర్ణచంద్రనాయుడు తృతీయ స్థానంలో నిలిచాడు. 1500 మీటర్ల పరుగు పందెంలో డి.హరీష్ మొదటి స్థానంలో నిలవగా, పి.కుమార్ రెండవ స్థానంలో నిలిచాడు. అండర్-14 బాలుర విభాగంలో కె.మనోహర్ మొదటి స్థానంలో నిలిచాడు. 200 మీటర్ల పరుగు పందెంలో కె.మోహన్ మొదటి స్థానంలో నిలవగా, సిహెచ్.మనోహర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్ల పరుగు పందెంలో వి.చంద్రకిరణ్ మొదటి స్థానంలో నిలవగా, సిహెచ్.మనోహర్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. 600 మీటర్ల పరుగు పందెంలో వి.చంద్రకిరణ్ మొదటి స్థానంలో నిలవగా జి.సాయి శంకర్ రెండో స్థానంలో నిలిచాడు. పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభను చూపడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు ఎ.శేఖర్ తెలిపి విద్యార్థులను అభినందించారు.

అబ్బురపరిచిన యోగా విన్యాసాలు

- జిల్లాస్థాయి యోగా పోటీలకు విశేష స్పందన
- జిల్లా నుంచి 48 మంది రాష్ట్ర పోటీలకు ఎంపిక


అబ్బుర పరిచిన వృశ్చికాసనం

చోడవరం: చోడవరం ఉషోదయ కాలేజీలో పతంజలి యోగా శిక్షణా కేంద్రం గురువు పుల్లేటి సతీష్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసాల పోటీలు ఆదివారం జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు, పురుషులు, స్త్రీలు ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చారు. 8నుంచి 80 సంవత్సరాలు వయస్సు ఉన్నవారంతా పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం ఎనిమిది కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించారు. 8–14 వయస్సు విభాగంలో బాలురు 50, బాలికలు 35 మంది పాల్గొన్నారు. 14–20 విభాగం లో బాలురు 25, బాలికలు 15 మంది, 30–40 విభాగంలో పురుషులు 12, స్త్రీలు 10 మంది, 40–50 విభాగంలో పురుషులు 10, స్త్రీలు 8మంది, 50–60పైబడిన విభాగంలో పురుషులు 8, స్త్రీలు ఆరుగురు పాల్గొన్నారు. ప్రధానంగా వృశ్చికాసనం, గండబెరండాసనం, కుకుటాసనం, సూర్యనమస్కారాలు ఆసనాల్లో ఎక్కువగా పోటీ జరిగింది. యోగా అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్, గౌరవ అధ్యక్షుడు పప్పల రమణమూర్తి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో మేలని, ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 48 మందిని జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వీరంతా ఈనెల 25, 26తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ బహుమతులు అందజేశారు.


రేపు బెంగళూరుకు ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: దీపావళి సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-ఎస్‌ఎంవీ బెంగళూరు(08545) వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-ఎస్‌ఎంవీటి బెంగళూరు(08545) వన్ వే స్పెషల్ రైలు ఈ నెల 21న విశాఖపట్నంలో ఉదయం 8.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటిరోజు ఉదయం 6.45 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పడి, జాలర్‌పేట, కుప్పం, బంగార్‌పేట, కృష్ణరాజపురం స్టేషన్లలో ఆగుతుంది.

భారీ వర్షానికి పొంగుతున్న ఏరులు

- ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు, బొడ్డేరు, తాచేరు
- అప్రమత్తమైన జలాశయం అధికారులు


పొంగి ప్రవహిస్తున్న పెద్దేరు నది


నిండుకుండలా పెద్దేరు జలాశయం

మాడుగుల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దేరు, రైవాడ, కోనాం జలాశయాలు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. ఖరీఫ్ వరి చేలు కూడా పొట్టదశకు చేరుకోవడంతో ఖరీఫ్ పంటలకు ఢోకాలేదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఖరీఫ్ సాధారణ వరి సాగు 50 వేల ఎకరాలు కాగా ప్రస్తుతం 70 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ ఎరువుల కొరతతో చేలు పనికిరాలేదని , దిగుబడులు అంతగా రావని రైతులు దిగులు చెందుతున్నారు. ఈ వర్షాలు మెట్టు సాగుకు కూడా ఉయోగపడుతుందని, రైతులు చెబుతున్నారు.జలాశయాల్లో పుష్కలంగా వరద నీరు చేరడంతో ఏరుల్లోకి వరద నీరు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు పశువులను దింపరాద, నదుల దగ్గరకు వెళ్లరాదని మాడుగుల తహసీల్దార్ రమాదేవి హెచ్చరికలు చేశారు.

జలాశయాల్లో నీటిమట్టాలు మీటర్లలో

జలశయం	గరిష్ట	ప్రస్తుతం	విడుదల చేస్తున్నది
పెద్దేరు	137	136	520 క్యూసెక్కులు
రైవాడ	114	112	విడుదలలేదు
కోనాం	101.25	98	50 క్యూసెక్కులు


నిండుకుండలా రైవాడ జలాశయం

క్రికెట్ పోటీల విజేత విశాఖ రెవెన్యూ జట్టు

విశాఖ స్పోర్ట్స్: జోన్-1 రెవెన్యూ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ టైటిల్ పోరులో విశాఖ రెవెన్యూ జట్టు ఏడు వికెట్ల తేడాతో అనకాపల్లి రెవెన్యూ జట్టుపై విజయం సాధించింది. రైల్వే స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో జోన్ పరిధిలోని ఆరు జట్లు పోటీ పడగా ఆదివారం ఫైనల్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనకాపల్లి జట్టు 16 ఓవర్లలో 88 పరుగులకు ఆలౌటైంది. విశాఖ కెప్టెన్ రాజేంద్ర నాలుగు వికెట్లు తీసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. ప్రసన్న కుమార్ రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా విశాఖ జట్టు 14 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. భవానీశంకర్ 36 పరుగులతో రాణించాడు.

ట్రాక్టరు కింద పడి యువకుడు దుర్మరణం


లక్ష్మణరావు మృతదేహం

కోటవురట్ల: ట్రాక్టరు బోల్తాపడి మీద పడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలివి. గొలుగొండ మండల కసిమి గ్రామానికి చెందిన చిన్ని లక్ష్మణరావు (27) మండలంలోని పాములవాకలో కుంచా కన్నబాబుకు చెందిన జీడితోటను లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో జీడితోటలో దుక్కిపనులను శుక్రవారం ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన అల్లు నాగసత్య ట్రాక్టరుతో దుక్కిపనులు నిర్వహించి సాయంత్రం ఇంటికి వెళ్లిపోతుండగా అదే ట్రాక్టరుపై చిన్ని లక్ష్మణరావు కూర్చుని వెళుతుండగా నీలిగుంట సమీపంలోని తాండవా కాలువను దాటుతుండగా ట్రాక్టరు బురదలో ఇరుక్కుపోయింది. బయటకు తీసే ప్రయత్నంలో ట్రాక్టరు తిరగబడి దాని కింద చిన్ని లక్ష్మణరావు ఇరుక్కుపోయాడు. పొట్టలోకి ఇనుపరాడ్ దిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే స్పందించి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందాడు. ఈ విషయమై చిన్ని లక్ష్మణరావు తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దివాళీ ధోకా

- ఏయూ మైదానంలో బాణసంచా స్టాళ్ల అనుమతుల్లో గందరగోళం
- ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యం
- 14 నుంచి పనులు చేపట్టినా, 16న అనుమతులు మంజూరు
- పోలీస్ అనుమతులు లేకుండానే స్టాళ్ల ఏర్పాటు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో బాణసంచా స్టాళ్ల అనుమతుల వ్యవహారం రచ్చకు దారితీసింది. ఎప్పుడూ లేని విధంగా దుకాణాల లీజు అంశం దుమారం రేపింది. ఈ విషయంలో ఏకంగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యం చేసుకోవడం వర్సిటీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడం, ఆ తర్వాత అనుమతుల కోసం కలెక్టర్ ఉన్నత విద్యా శాఖకు లేఖ రాయడం, అనంతరం అనుమతులు ఇవ్వాలని అక్కడి నుంచి వీసీకి లేఖ రావడం, చివరకు 14వ తేదీ నుంచి పనులకు అనుమతులు ఇచ్చినట్లు 16న ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. అది కూడా ఏయూ వీసీ కాకుండా.. రిజిస్ట్రార్ పేరుతో అసిస్టెంట్ రిజిస్ట్రార్(అకౌంట్స్) సంతకంతో అనుమతులు ఇవ్వడం మరింత చర్చనీయాంశమైంది. కాగా.. ఏయూలోని స్టాళ్లలో సగానికి పైగా ఎటువంటి లైసెన్సులు లేకుండానే ఏర్పాటైనట్లు తెలుస్తోంది. ఈ విషయంలో పోలీసులు ఆదివారం మధ్యాహ్నం కొంత సేపు హడావుడి చేసి వెళ్లిపోయారు.

ఉన్నత విద్యా శాఖ జోక్యం

ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో బాణసంచా స్టాళ్లను ప్రతి ఏటా ఏర్పాటు చేయడం సాధారణం. దీనికి ఏయూ వీసీ అనుమతులు ఇవ్వడం సర్వసాధారణ విషయం. కానీ ఈ సారి మాత్రం స్టాళ్ల అనుమతుల అంశం గందరగోళంగా, వివాదాస్పదంగా మారింది. ఏయూ మైదానాలను, ప్రాంగణాలను ప్రైవేట్ కార్యక్రమాల కోసం అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. కొద్ది నెలల కిందట బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమా ఈవెంట్‌కు అనుమతులు ఇవ్వడం తీవ్ర దుమారం రేగింది. దీంతో అప్పటి నుంచి ప్రైవేట్ కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఇటీవలే క్రెడాయ్ ఒక కార్యక్రమ నిర్వహణకు ఈ మైదానాన్ని లీజుకు కోరగా.. ఇదే కారణంతో తిరస్కరించారు. అయితే.. దీపావళి సందర్భంగా ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఇంజినీరింగ్ గ్రౌండ్‌లో స్టాళ్ల ఏర్పాటుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. దుకాణాల కోసం మైదానాన్ని లీజుకు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్‌కు లేఖ రాశారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు దుకాణాల పనులకు, 18 నుంచి 20వ తేదీ వరకు అమ్మకాలకు, 21న స్టాళ్ల తొలగింపునకు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై వీసీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ 13వ తేదీ నుంచే గ్రౌండ్‌లో పనులు చేపట్టేశారు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీరియస్ అయ్యారు. అనుమతులు లేకుండా ఎలా స్టాళ్ల ఏర్పాటు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అనుమతుల కోసం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖకు లేఖ రాశారు. దీంతో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యాలయం నుంచి ఏయూ వీసీకి లేఖ వచ్చింది. కలెక్టర్ లేఖపై సమస్యను పరిష్కరించి, 14 నుంచి అనుమతులు ఇవ్వాలని 15న లేఖ పంపించడం ఇక్కడ విశేషం.



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బాణసంచా విక్రయాలు

పనులు ప్రారంభించాక అనుమతులు

కలెక్టర్ ఆదేశాలతో ఇంజినీరింగ్ కాలేజ్ హెలిప్యాడ్ మైదానంలో ఉన్న స్టాళ్ల పనులను తొలగించారు. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యంతో కొత్తగా దుకాణాలను పార్కింగ్ మైదానానికి మార్చారు. ఇదిలా ఉండగా.. 15న ఉన్నత విద్యా శాఖ నుంచి లేఖ వస్తే, 16న ఏయూ అధికారులు అనుమతులు ఇచ్చారు. అది కూడా 14న పనులకు అనుమతులు ఇస్తున్నట్లు 16న ఉత్తర్వులు ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రధానంగా ఈ అనుమతుల పత్రంపై ఏయూ వీసీ సంతకంతో కాకుండా, రిజిస్ట్రార్ పేరుతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (అకౌంట్స్) సంతకం ఉండడం గమనార్హం. తమ చేతికి మట్టి అంటకుండా, ఏదైనా సమస్య వస్తే దాన్ని కింది వారిపైకి నెట్టేసే ఉద్దేశంతోనే ఈ విధంగా చేశారన్న చర్చ జరుగుతోంది.

అనుమతులు లేకుండా స్టాళ్లు

నగరంలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు, వ్యాపారాలపై పోలీసులు వారం రోజులుగా వరుస దాడులతో హడావుడి చేశారు. కానీ ఏయూలో అనేక దుకాణాలు అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినా పట్టించుకోలేదు. బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. కానీ ఏయూలో ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారు. ఆదివారం మధ్యాహ్నం డీసీపీ, ఏసీపీలు వెళ్లి అనుమతులు లేని స్టాళ్లను వెంటనే మూసేయాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసి వెళ్లిపోయారు. కానీ ఏ ఒక్కరూ పోలీసుల హెచ్చరికలు పట్టించుకోకుండా అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపట్టడం గమనార్హం.

పల్లెకు చలో చలో



వెలుగుల పండగను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాలనే ఉత్సాహంతో నగరవాసులు సొంతూళ్లకు పయనమయ్యారు. పండగకు ముందు ఆదివారం సెలవు కలసిరావడంతో.. పట్టణ జీవితానికి తాత్కాలిక విరామం ఇచ్చి, పల్లె బాట పట్టారు. దీంతో ద్వారకా కాంప్లెక్స్ జనసందోహంతో కిటకిటలాడింది. అయితే బస్సుల్లో సీటు సంపాదించడం కోసం ప్రయాణికులు పడిన పాట్లు వర్ణనాతీతం. చంటి బిడ్డలను పట్టుకుని బస్సుల్లో సీట్ల కోసం తల్లులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే బస్సులన్నీ ఖాళీ లేకుండా ప్రయాణించాయి.
- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





అవతరణ దినోత్సవంపై భేషజాలు వీడండి

- తెలుగుదండు అధ్యక్షుడు ఫణిశయన సూరి
- నవంబర్ 1అధికారికంగా నిర్వహించాలని సీఎంకు బహిరంగ లేఖ


మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు నిరసన

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1న అధికారికంగా నిర్వహించాలని తెలుగుదండు డిమాండ్ చేసింది. ఈ మేరకు మద్దిలపాలెం కూడలిలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద ఆదివారం నిరసన జరిగింది. తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి నేతృత్వంలో సాహితీవేత్తలు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను విడుదల చేశారు. 'ఈ ఏడాది నుంచైనా నవంబరు 1న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి. తెలంగాణ విడిపోయినా, నవంబర్ 1వ తేదీ యథావిధిగా మన రాష్ట్ర అవతరణ దినోత్సవమే. దీనిపై భేషజాలకు పోకుండా అవతరణ దినోత్సవాన్ని జరిపించాలి.' అని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, అధికార భాషా సంఘం స్థానంలో మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని ఫణిశయన సూరి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ప్రసాద్, చిన్న సూర్యానారాయణ, అడపా రామకృష్ణ, రాజమన్నార్, హేమ, ఉండవిల్లి సుజాత, ప్రజా గాయకుడు దేవీశ్రీ తదితర సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్నదానం మిన్న


అన్నసమారాధనను ప్రారంభిస్తున్న డాక్టర్ విష్ణుమూర్తి

అనకాపల్లి టౌన్: అన్ని దానాల కన్నా అన్న దానం మిన్న అన్ని డాక్టర్ విష్ణుమూర్తి తెలిపారు. మండలంలోని బట్లపూడి పంచాయతీ నాయుడుపేటలోని సోహం ఆశ్రమంలో ఆదివారం అన్నసమారాధన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండి ఎదుటవారికి సహాయపడాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు రామారావు, పెంటకోట అరవింద బాజ్జీ, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక ధనలక్ష్మిపూజ


నూకాంబిక ఆలయంలో ధనలక్ష్మి పూజ చేస్తున్న మహిళలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఆశ్వయుజ మాసం ధన త్రయోదశి ఆదివారం పురస్కరించుకుని ఆలయ మండపంలో సామూహికంగా మహిళలతో ధనలక్ష్మి పూజలు నిర్వహించారు. పూజా అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'రాచ పీనుగు' చారిత్రక కథకు పురస్కారం


బొడ్డేడ బలరామస్వామి

కశింకోట: కశింకోటకు చెందిన కథా రచయిత బొడ్డేడ బలరామస్వామి రాసిన 'రాచ పీనుగు' చారిత్రక కథకు హైదరాబాద్‌కు చెందిన జాగృతి వార పత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమంలో రూ.12 వేలు, జ్ఞాపికను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారని బలరామస్వామి తెలిపారు. ఇప్పటి వరకు 34 కథలు, పలు కవితలు రాయడం, అవి పలు వార, మాస పత్రికలు, ఇతర పత్రికల్లో ప్రచురితమై నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు పొందానన్నారు. బలరామస్వామికి బహుమతి లభించడం పట్ల పలువురు సాహితీ ప్రియులు, అభిమానులు అభినందనలు తెలిపారు.

రేపటి నుంచి డివిజన్ స్థాయి పోటీలు

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ హైస్కూల్‌లో ఈ నెల 21, 22, 23 తేదీల్లో అనకాపల్లి డివిజన్ ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్) ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు హెచ్ఎం బ్రహ్మాజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి పోటీల్లో ఎంపికైన ఎస్‌జీఎఫ్ క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీలకు హాజరు కావాలని కోరారు. వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తామన్నారు. డివిజన్ పరిధిలో 12 మండలాల నుంచి బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొంటారని, డివిజన్ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎస్‌జీఎఫ్ డివిజన్ కో ఆర్డినేటర్ ఎస్.వి.నరసింహంను సంప్రదించాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: తెలుసు కదా
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: డ్యూడ్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: మిత్రమండలి
వెంకటేశ్వర	: మమ్మీ ఈజ్ బ్యాక్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయం రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–16, బీ పాజిటివ్–21, ఓ పాజిటివ్–19, ఏబీ పాజిటివ్–4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూలోకేష్(9703613706) నంబరును సంప్రదించవచ్చు.


గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 319 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 282 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.

మార్కెట్లలో సందడి

- కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట
- పెరిగిన మందుగుండు సామగ్రి ధరలు
- పూలు, పండ్ల ధరలకు రెక్కలు


చెరకు గెడలు




వివిధ రకాల ప్రమిదలు


ఎన్టీఆర్ క్రీడా మైదానంలో బాణసంచా కొనుగోళ్లు

అనకాపల్లి: దీపావళి వెలుగుల పండగ.. చిన్నాపెద్ద తేడా లేకుండా ఇంటిల్లిపాదీ ఆనందంగా జరుపుకునే వేడుక.. దీన్ని అందరూ ఎంతో సంబరంగా నిర్వహించుకుంటారు. ఈ నేపథ్యంలో పట్టణంలో మార్కెట్లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. వస్త్ర మార్కెట్‌తోపాటు కిరాణా, వంట నూనె దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలో ఎటు చూసినా ఇసుక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది.

ఆకర్షణీయంగా ప్రమిదలు

ప్రధానంగా పలు రకాల ప్రమిదలు మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అలాంటి వారి కోసం సాధారణ రకంతోపాటు పలు డిజైన్లలో ప్రమిదలు విక్రయిస్తున్నారు. ఇటీవల స్థానికంగా తయారైన ప్రమిదలతో పాటు చెన్నై సహా వివిధ ప్రాంతాల్లో భిన్నంగా ఉండే ప్రమిదలను కొనుగోలు చేసి అక్కడ మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఆకర్షణీయమైన ప్రమిదల వైపే అందరూ మొగ్గు చూపుతున్నారు. ఈ పండగకు ఒక ప్రత్యేకించి ప్రధాన మార్కెట్లు, ప్రధాన రహదారి కూడళ్లలో ప్రమిదల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

జోరుగా బాణసంచా విక్రయాలు

స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 48 దుకాణాలు, రింగ్‌రోడ్డు బెల్లం మార్కెట్ దుకాణాల్లో 15 ఏర్పాటు చేసి మందుగుండు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.
మార్కెట్‌లో దీపావళి సామాన్ల ధరలు ఆకాశాన్నంటడంతో కొనుగోలుదారుల సంఖ్య తగ్గింది. చిన్నపిల్లలు బాణసంచా ఎక్కువగా ఇష్టపడడంతో తప్పని పరిస్థితులల్లో పెద్దలు మందుగుండు కొనుగోలు చేస్తున్నారు. ప్రమిదలు డజన్ రకాన్ని బట్టి రూ. 50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న కార్తీకమాసంలో నాలుగు వారాలు దీపాలు వెలిగించి పూజలు నిర్వహిస్తారు. కనుక మహిళలు ముందు జాగ్రత్తతో కళాత్మకమైన ప్రమిదలు కొంటున్నారు. పెద్దలకు చెరకుగడలు, లక్ష్మీదేవిని పూజించేందుకు వివిధ రకాలైన పూలు, పండ్లు, కొబ్బరి కాయలతో మార్కెట్ కళకళలాడుతోంది. వీటి ధరలు అమాంతంగా పెంచి విక్రయిస్తున్నారు.

బాణసంచా విక్రేత అరెస్టు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తున్న మునగపాక శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా రూ. 4800 విలువ కలిగిన బాణసంచా స్వాధీనం చేసుకున్నామన్నారు. కశింకోటలో 6, తాళ్లపాలెంలో 4 బాణసంచా దుకాణాల్లో విక్రయానికి ఆర్డీవో అనుమతి ఇచ్చారని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో అనుమతి లేక విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

సీసీ కెమెరా ఏర్పాటు


బయ్యవరం వద్ద ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరా

కశింకోట: మండలంలోని బయ్యవరంలో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. దీనివల్ల రహదారిపై నేరాలు, ప్రమాదాలు జరిగినప్పుడు కెమెరాలో సుమారు కిలో మీటరు దూరం వరకు రికార్డు కాగలదని, తద్వారా వాటిని నివారించవచ్చునని జాతీయ రహదారి సిబ్బంది తెలిపారు.

22 నుంచి కార్తీక మాస పూజలు

అనకాపల్లి టౌన్: మండలంలోని సిరసపల్లి గ్రామం చింతామణి గణపతి దత్త క్షేత్రంలో కార్తీక మాస మహోత్సవాలు ఈ నెల 22 నుంచి నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఆంజనేయులు తెలిపారు. నెల రోజుల పాటు పంచామృతములతో ఏకవార రుద్రాభిషేకాలు, సహస్ర భస్మార్చన, బిల్వాష్టోత్తర శతమార్చన, నక్షత్ర దీప ప్రజల్వన పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల కలయిక


టెన్త్ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి హైస్కూలులో 2004–05లో టెన్త్ చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా పరస్పరం విద్యార్థులు పలకరించుకుని యోగ క్షేమాలు తెలుసుకొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులు శ్రీను, సురేష్‌లను ఘనంగా సత్కరించి పాదపూజ చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు మునగపాక బాబూరావు, మజ్జి శంకర్, కోన రవి, కోన రవీంద్ర, కె. రూపదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భజన పోటీలకు 60 బృందాలు

రోలుగుంట : ఈ నెల 22 నుంచి కుసుర్లపూడి గ్రామ సమీపంలో గల బాబా ఆశ్రమం వద్ద జిల్లా స్థాయి భజన పోటీలు జరగనున్నాయి. అందుకోసం జిల్లాలో గల వివిధ మండలాల నుంచి 60 బృందాలు తమ కమిటీ వద్ద నమోదు చేసుకున్నాయని నిర్వాహకుడు గండి సింహాద్రి తెలపారు. ఏ బృందం ఎవరితో పోటీలో పాల్గొనున్నాయో ఈ నెల 18న శనివారం బాబా ఆశ్రమంలో డ్రా తీయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 22 నుంచి ఈ పోటీలు నిర్వహించి ఫైనల్‌కు చేరిన వారికి వచ్చే నెల 2,3,4 తేదీల్లో ఫైనల్స్ నిర్వహించి, 5న ఎంపికైన విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. డ్రా తీసిన విధంగా ఆయా భజన బృందాల్లో పోటీల్లో పాల్గొనాలని కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ


రెండు లారీల మధ్య ఇరుక్కుపోయిన డ్రైవర్ వెంపల రవిచరణ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం హైవేపై ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సింహాచలం తెలిపిన వివరాలు.. హైవేపై చిన్నయ్యపాలెం వద్ద సర్వీస్ రోడ్డులోని టీ స్టాల్ ముందు ఆదివారం ఉదయం ఓ లారీ డ్రైవర్ తన లారీని నిలిపాడు. పెందుర్తి నుంచి సబ్బవరం వైపు వస్తున్న మరో లారీ ఆగివున్న ఈ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆ లారీ డ్రైవర్ వెంపల రవిచరణ్(25) రెండు కాళ్లు ఇరుక్కుపోయి, తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతోపాటు సబ్బవరం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. 108 సిబ్బంది డాక్టర్ల సూచన మేరకు ఇరుక్కున్న లారీ క్యాబిన్లోనే రవిచరణ్‌కు సెలైన్ బాటిల్ ఎక్కించి, అత్యవసర వైద్య సేవలు అందించారు. రెండున్నర గంటల పాటు శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీసి, కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన డ్రైవర్ మూడు రోజులగా వాహనాన్ని నడుపుతున్న నేపథ్యంలో నిద్రమత్తులో ఈ ఘటన జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జీఎల్ఎన్ శాస్త్రి నియామకంపై హర్షం



అనకాపల్లి టౌన్: ప్రతిష్టాత్మక శ్రీశ్రీ కళావేదిక ఏపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత జీఎల్ఎన్ శాస్త్రి ఎంపికయ్యారు. ఈ మేరకు కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈయన ఎంపికపై సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి కార్తీక మాసోత్సవ పూజలు నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. రోజూ స్వామి వారికి అర్చన పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవం భక్తుల సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల నవంబర్ 1న కార్తీక శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని 300 కిలోల చందనంతో స్వామి వారికి విశేష అలంకరణ, సుప్రభాత సేవ, విశేష అర్చన, సహస్ర నామార్చన జరుగుతాయన్నారు. అదే నెల 2న ద్వాదశి రోజున లక్ష్మీనారాయణ పూజలు, సాలగ్రామ పూజలు నిర్వహిస్తామన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పరవాడ: ఇటీవల గుండె పోటుతో మరణించిన స్థానిక జెడ్పీ హైస్కూల్లో 1998–99 టెన్త్ బ్యాచ్ విద్యార్థి వర్రి భాస్కరరావు కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆసరాగా నిలిచారు. చిన్న వయస్సులోనే భాస్కరరావు అకాలమరణంతో అతని కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. దీంతో అతనితో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమకు తోచిన సాయం చేసేందుకు ముందుకొచ్చారు. తలా కొంత నగదు సేకరించి ఆ వచ్చిన మొత్తం రూ.1.20 లక్షలను కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. మిత్రుడు లేకపోయినా.. అతని కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్నారు.

అధ్వానంగా తాళ్లపాలెం రోడ్డు

- దారిపొడవునా గోతులు
- గాయాల పాలవుతున్న వాహనదారులు


వాహనాల నుంచి రేగుతున్న ధూళి, బుగ్గి


తాళ్లపాలెం కూడలిలో గతుకులతో నిండి ఉన్న రోడ్డు


పాల కేంద్రం సమీపాన గతుకుల రోడ్డు


భారీ లోడ్ వాహనాల రాకపోకలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో రోడ్లు, భవనాల శాఖకు చెందిన ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. పలుచోట్ల గతుకుల మయంగా మారింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది చెందుతున్నారు. చాలా కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, నిత్యం ఇక్కట్లు తప్పడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.
మండలంలో కశింకోట తర్వాత రెండో మేజర్ పంచాయతీగా తాళ్లపాలెం ఉంది. బంగారయ్యపేట శివారు గ్రామం. 5 వేల జనాభా కలిగి ఉంది. దాదాపు 20 గ్రామాలకు ప్రధాన కూడలిగా ఉంది. ఈ గ్రామం మీదుగా రెండు ప్రధాన రహదారులు వెళుతున్నాయి. అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు జాతీయ రహదారి, తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారి ఉన్నాయి. వీటిలో రోడ్లు, భవనాల శాఖ రోడ్డు తాళ్లపాలెం గ్రామం మధ్యగా వెళుతోంది. గ్రామ పంచాయతీ సింహభాగం మేర ఈ రోడ్డుకు రెండు వైపులా తాళ్లపాలెం కూడలి నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న వారపు సంత ప్రాంతం వరకు గ్రామం విస్తరించి ఉంది. రోడ్డు పొడవునా రెండు వైపులా ఇళ్లు, దుకాణాలు, ఇతర సంస్థలు నెలకొని ఉన్నాయి. ఈ రోడ్డు పలు ప్రాంతాల్లో దెబ్బతిని గతుకుల మయంగా ఉంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు, ప్రయాణికులు, వాహన చోదకులు ఏ సమయంలో ఎటువంటి ప్రమాదానికి గురికావలసి వస్తుందోనని నిత్యం భయ పడుతున్నారు.

భారీ లోడ్ వాహనాలతో దెబ్బతిన్న రోడ్డు

తాళ్లపాలెం కూడలి, అక్కడి పాల కేంద్రం, రామాలయం, పెట్రోల్ బంకు, పోలవరం కాలువ ప్రాంతం, వారపు సంత ప్రాంతాల్లో రోడ్డు గోతులు పడి ప్రమాదకరంగా మారాయి. బండరాళ్లు, మెటీరియల్, గ్రావెల్ వగైరా తరలించే భారీ వాహనాలు తాకిడికి రోడ్డు దెబ్బతింటోంది. దీంతో గతుకుల ప్రాంతాల్లో ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా గతుకుల్లో పడి ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదానికి గురై ప్రయాణికులు క్షతగాత్రులు కావడం, వాహనాలు మరమ్మతులకు గురికావడం వంటి సంఘటనలు నిత్యం చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం పడితే గోతుల్లో నీరు చేరి అవి కాన రాక గోతుల్లో పడి ప్రమాదాలు కొని తెచ్చుకోవలసి వస్తోందని వాహన చోదకులు మదన పడుతున్నారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు మాత్రం శాశ్వత ప్రాతిపదికన కాకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. భారీ వాహనాల తాకిడికి రోడ్డు యధావిధిగా గతుకులు పడి ఇబ్బంది చెందక తప్పడం లేదని వాపోతున్నారు. తాళ్లపాలెం గ్రామ ప్రజలకు తమ ఇళ్లకు, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి, అనకాపల్లి– నర్సీపట్నం వైపు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో రోడ్డు బాగోక మరింత ఇబ్బంది చెందక తప్పడం లేదు. చాలా కాలంగా రోడ్డు అధ్వానంగా ఉన్నా, ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు కలిగించుకొని రహదారికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి తమ కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

గతుకుల్లో పడి ప్రమాదాలు



తాళ్లపాలెం గ్రామం మీదుగా ఉన్న రహదారి, భవనాల శాఖ రోడ్లు పలుచోట్ల గతుకులు పడి ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు గతుకుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహన చోదకులు, ప్రయాణికులు పలు దఫాలు క్షతగాత్రులయ్యారు. వాహనాలు దెబ్బతిని మరమ్మతులకు గురయ్యాయి. తాళ్లపాలెం పంచాయతీ ప్రజలు, అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు రాకపోకలకు ఇదే ప్రధానమైన రోడ్డు, దీనిదృష్ట్యా అధికారులు సత్వరమే దెబ్బతిన్న రోడ్లకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ప్రజల కష్టాలు తీర్చాలి. –లగిశెట్టి గణేష్, తాళ్లపాలెం